క్లుప్తంగా

నేడు వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

నరసరావుపేట రూరల్: జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా మేదుమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన పట్టణంలో వంద అడుగుల జాతీయ జెండా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు గురువారం తెలిపారు. పీఏసీ కళాశాల నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ జరుగుతుందని వివరించారు.

జలశక్తి అభియాన్‌పై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వెలుగు కార్యాలయంలో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నీటి విలువల గురించి తెలియజేశారు. గ్రామాల్లోని సిబ్బంది జలశక్తి అభియాన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహిళా సంఘాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి జలశక్తి అభియాన్‌పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

వినుకొండ(నూజెండ్ల): భ్రమరా జెనిత్ సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఎంపీడీవో నరసయ్య, చీకటీగలపాలెం పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలకల్పనపై యాజమాన్యానికి లిఖితపూర్వకంగా కోరినా వారు తమపట్ల కక్షసాధింపుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే సమస్యల పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు ఎ.రజిని, కోడూరి శేషగిరిరావు, భవనాసి శ్రీనివాసరావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్‌కు మెరుగైన వైద్యం

శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న లైన్‌మెన్‌కు మరింత మెరుగైన వైద్యాన్ని అందించేందుకు గుంటూరు తరలించారు. మండలంలోని కొత్తలూరు గ్రామసచివాలయంలో విధులు నిర్వహిస్తున్న (గ్రేడు–2) విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ జాజాం కొండలరావు వినుకొండ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. స్థానికంగా చికిత్స అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రవేటు వైద్యశాలకు తరలించినట్లు మండల విద్యుత్‌శాఖాధికారి జవ్వాజీ నటరాజ్ గురువారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన పెదకంచర్ల కాల్వ పరిధిలో జాతీయ రహదారి మార్గంలో ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై చల్లా సురేష్ కథనం ప్రకారం.. మండలంలోని గంటావారిపాలెం గ్రామానికి చెందిన తెల్లమేకల కోటయ్య (50) వ్యక్తిగత పనులపై బైకుపై వినుకొండకు వెళుతున్నాడు. అయితే మార్గమధ్యంలో కనమర్లపూడి పెద కంచర్ల కాల్వ డివైడర్‌ను బైకు ఢీకొనటంతో తలకు బలమైన గాయాలై సంఘటన స్థలంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించి శవపంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిపారు.

నూలుమిల్లు కార్మికుడు ఆత్మహత్య

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో నూలుమిల్లు కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రం గంజాంజిల్లా పాతాపూర్‌కు చెందిన నీలామాధవ్‌స్వైన్ (36) ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి యడ్లపాడు మండలానికి వలస వచ్చారు. రెండేళ్ల కిందట మండలంలోని తిమ్మాపురం వసంత ఇండస్ట్రీస్‌లో కార్మికులకు చేరారు. అప్పటి నుంచి మిల్లులోనే క్వార్టర్స్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీలా మాధవ్‌స్వైన్ గతనెల 13న ఒరిస్సాకు వెళ్లారు. అదేనెల 31వ తేదీన నీలామాధవ్‌స్వైన్ ఒక్కడే మిల్లుకు తిరిగి వచ్చాడు. అరోజు సూర్యనారాయణగౌడ్ అనే వ్యక్తితో కలిసి నాదెండ్ల మండలం గణపవరంలోని ఓ మద్యం దుకాణంలో అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. ఆగస్టు ఒకటో తేదీ తెల్లవారుజామున తిరిగి విధులకు పిలిచేందుకు సూర్యనారాయణ గౌడ్‌క్వార్టర్‌లోని నీలామాధవ్‌స్వైన్ గదికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు చీరెతో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించడంతో మిల్లు యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. భార్య సైనేస్వైన్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నారు.

బుల్లెట్ అపహరణ

యడ్లపాడు: మండలంలోని కోట గ్రామంలో బైక్ చోరీ అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...కోట గ్రామానికి చెందిన పఠాన్ రెహమాన్ మూడేళ్ల కిందట బుల్లెట్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటిముందు బుల్లెట్‌ను నిలుపుదల చేసి హ్యాండిల్ ల్యాక్ చేయగా రాత్రి అపహరణకు గురైంది. తెల్లవారుజామున తండ్రి బండి లేని విషయాన్ని గ్రహించి కుమారుడిని ప్రశ్నించగా అపహరణకు గురైందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిపాలు బిడ్డకు దివ్యౌషధం

హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు

యడ్లపాడు: వందశాతం పోషక విలువలతో కూడిన తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని ప్రసాదిస్తుందని హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా పాఠశాల, అంగన్‌వాడీలోని చిన్నారులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సొలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం జోజమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ నళిని, ఎస్ సువర్చన, షేక్ కరిమూన్, ఎం.నాగసీలేశ్వరి, పిల్లల తల్లులు హాజరయ్యారు.

శావల్యాపురం:మండలంలోని కారుమంచి గ్రామంలో అంగన్‌వాడీ సెంటరులో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అరు సెంటర్ల అంగన్‌వాడీ కార్యకర్తలు సీతామహాలక్ష్మి, శ్రీదేవి, సామ్రాజ్యం, తిరుమలదేవి, హరిత,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ప్రభుత్వాసుపత్రి వైద్యులు తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో 100 పడకల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా తల్లిపాల ప్రాధాన్యత వివరిస్తూ ఇన్నర్‌వీల్ క్లబ్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారి, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజిని, నార్నే జయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సత్యదీప్తి, డాక్టర్ సుప్రజ, డాక్టర్ శ్రీనివాస్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వినుకొండ టౌన్: తల్లిపాలే పుట్టిన బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందని అంగన్వాడీ సూపర్వైజర్ ఎం. శ్రీలత పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వినుకొండ రూరల్ పిట్టంబండ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి. హారతి, ఎం. నాగలక్ష్మి, పి. కోటేశ్వరి, ఏఎన్‌ఎం, బాలింతలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


కొండవీడులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు అమృతం

నాదెండ్ల: బిడ్డ మానసిక శారీర ఎదుగుదలకు తల్లిపాలు అమృతంతో సమానమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని సాతులూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సాతులూరు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. సర్పంచ్ ముసుగు శోభారాణి, సూపర్‌వైజర్ పద్మ, మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, డీపీవో ఎంపీ భాస్కరరెడ్డి, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, కార్యదర్శి రాఘవయ్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేయండి

సీడీపీవో అనురాధ

శావల్యాపురం: తల్లిపాల వారోత్సవాలు అన్నీ అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించి విజయవంతం చేయాలని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో అనురాధ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటరులో ఈనెల 7 వరకు తల్లిపాలు ప్రాముఖ్యతపై వివిధ కార్యక్రమాల రూపంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించటంతో పాటు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. వినుకొండ రూరల్ అర్బన్, నూజెండ్ల, శావల్యాపురం మండలాల పరిధిలో 284 అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత ఉన్నారు.

పింఛన్‌దారులకు నగదు పంపిణీ

నాదెండ్ల: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు తొలిరోజు గురువారం సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి 98 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలోని 16 సచివాలయాల్లో 9,581 మంది లబ్ధిదారులకు గాను రూ.4,08,48,000లు పంపిణీ చేయాల్సి ఉంది. పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎంపీ భాస్కర్‌రెడ్డి, తూబాడు, చందవరం, సాతులూరు గ్రామాల్లో పంపిణీ చేశారు. సాతులూరు, చందవరం గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో 7.78 లక్షల మందికి రూ.326.84 కోట్లు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో సాతులూరు సర్పంచ్ ముసుగు శోభారాణి, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారా యణ, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు 5971 మంది పింఛనుదారులు ఉండగా 96 శాతం పంపిణీ చేసినట్లు మండల ప్రత్యేక అధికారి మూలె వెంకట రెడ్డి గురువారం తెలిపారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గ్రామ సచివాలయ ఉద్యోగులు పింఛనుదారుల ఇంటింటికీ వెళ్ళి పింఛను నగదు తెల్లవారుజాము నుంచి పంపిణీ చేసినట్లు తెలిపారు.

బొల్లాపల్లి : మండలంలో గురువారం నిర్వహించిన సామాజిక భద్రతాపింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తయిందని ఎంపీడీవో పీఏ విజయకుమార్ తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళలకు చెందిన 8894మంది లబ్ధిదారులు ఉండగా 8560 మందికి పింఛన్ అందజేశామని చెప్పారు.


సాతులూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నరసరావుపేట రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం మండలంలో 96శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రవికాంత్ తెలిపారు. మండలంలోని లింగంగుంట్లలో పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. తెల్లవారుజామున 5గంటల నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించినట్టు తెలిపారు. వృద్ధులకు, వితంతవులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛన్ నగదును సచివాలయ సిబ్బంది అందజేస్తున్నట్టు తెలిపారు. మండలంలో 12,722 పింఛన్లు ఉండగా సాయంత్రం 6 గంటలకు 12,229 మందికి పింఛన్ల పంపిణీ చేసినట్టు వివరించారు.


వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

చిలకలూరిపేటటౌన్: పట్టణం, మండలంలోని అన్ని వార్డులు, గ్రామాల్లో గురువారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండలం పరిధిలోని గ్రామాల్లో 8661 మంది లబ్ధిదారులకు రూ.3,62,27,500 పంపిణీ చేయాల్సి ఉంది. గురువారం నాడు అధికారులు 8445 మంది లబ్ధిదారులకు రూ.3,53,62,000 నగదును ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. దీంతో మొత్తం 97.51శాతం పెన్షన్ పంపిణీ జరిగిందని ఎంపీడీవో తెలిపారు. అలాగే పట్టణం పరిధిలో పెన్షన్ పంపిణీ 96శాతం పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఈపూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు ఎస్సీ కాలనీలో గురువారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాయకులు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే అందజేత

యడ్లపాడు: మండలంలోని సందెపూడి, జాలాది గ్రామాల్లో చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పర్యటించారు. రెండు గ్రామాల్లోనూ గురువారం జరిగిన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, ఆయా పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ డబ్బుల్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, మాజీ అధ్యక్షుడు ముద్దన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యడ్లపాడులో 96.25 శాతం పంపిణీ

యడ్లపాడు: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ యడ్లపాడు మండలంలో 96.25 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పంపిణీ ప్రక్రియను మొదలు పెట్టిన గంట తర్వాత నెట్‌వర్క్ సర్వర్లు మొరాయించాయి. సర్వర్లు నెమ్మదిగా పని చేయడంతో అటు ఉద్యోగులు, ఇటు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెన్షన్ నగదును స్వయంగా లబ్ధిదారుని ఇంటికే వెళ్లి పంపిణీ చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల లబ్ధిదారులకు ఫోన్లు చేసి ఒకేచోటకు పిలిపించి పెన్షన్లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలం పరిధిలో మొత్తం 8020 మంది సామాజిక పెన్షన్లు ఉన్నాయన్నారు. గురువారం రోజున 12 గ్రామ సచివాలయాల పరిధిలో 7719 మందికి ఆయా పెన్షన్లు అందజేశామన్నారు.

సంక్షిప్తం

నేడు సమన్వయ సమావేశం

యడ్లపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, గృహనిర్మాణశాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

తల్లిదండ్రుల కమిటీ ఎన్నికల ప్రక్రియ

రొంపిచర్ల: మండలంలోని పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ ఎన్నిక సంబంధించి నోటిఫికేషన్‌ను గురువారం ఆయా పాఠశాల నోటీస్ బోర్డులలో ఉంచారు. మధ్యాహ్నం ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. ఈ నెల 5వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యర్థనాలను స్వీకరిస్తామన్నారు. ఫైనల్ ఓటర్ల జాబితాను సాయంత్రం పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచుతారు. 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు నామినేషన్‌ల స్వీకరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

పెసర, దోస పంటల పరిశీలన

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గోలి రత్తయ్య అనే రైతుకు చెందిన పెసర, దోస పంటలను వ్యవసాయాధికారి ఆర్. రామారావు గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దోస పంటలో తామర పురుగు, సూక్ష్మమూలకాల లోపాలను గుర్తించడం జరిగిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కళ్యాణి సెంటర్, సుబ్బయ్యతోట, బోస్‌రోడ్డు, కేబీ రోడ్డు, విజయబ్యాంకు పరిసర ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాదెండ్ల: గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ గణపవరంలోని వేలూరు రోడ్డు, రాజీవ్‌గాంధీకాలనీ, సినిమాహాల్ ఏరియా, ఇండస్ట్రీస్‌కు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

నరసరావుపేట టౌన్: కిరాణ దుకాణం తాళాలు పగులగొట్టి గల్లా పెట్టెలోని రూ.80 వేల రూపాయలు అపహరించుకు పోయిన సంఘటన గురువారం వెలుగు చూసింది. పట్టణానికి చెందిన సి.హెచ్ సుబ్బారావు కుమ్మరి బజారులో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణాన్ని కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం దుకాణ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఈ విషయాన్ని యజమానికి తెలియజేశారు. సుబ్బారావు వచ్చి పరిశీలించగా గల్లా పెట్టెలో ఉండాల్సిన నగదు కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రీం తీర్పు పట్ల హర్షం

చిలకలూరిపేట: ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా మోహన్‌మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పు వలన లక్షలాది మంది మాదిగలతో పాటు, 59 ఉపకులాలకు మేలు జరగబోతోందని తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడం శుభ పరిణామన్నారు.

రెండుపూటలా నీరిచ్చేలా చర్యలు తీసుకోండి

నరసరావుపేట: పట్టణంలో ఇకపై ఏ ఒక్కరు తాగునీటి గురించి ఫిర్యాదుచేసే అవకాశం ఉండకూడదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తాగునీటి సమస్యపై సమీక్ష చేశారు. అధికారులు తాగునీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పలు ప్రాంతాల్లో ఒక పూట మాత్రమే తాగునీరు వస్తున్నాయని ఫిర్యాదులు అందినట్లు చెప్పారు.

నమ్మకాన్ని పెంచింది

నరసరావుపేట: ఎస్‌సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ద్వారా దేశ న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచిందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగురి నాగరాజు మాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్యాయం తాత్కాలికమే కాని అంతమ విజయం శాశ్వతమైన ధర్మానిదే అన్నారు. ఈ రిజర్వేషన్ల వర్గీకరణ తమ హక్కు, వాటా అన్నారు.

ఉర్దూ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట రూరల్: ఉర్దూ భాషకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని ములకలూరు ఉర్దూ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, పార్టీ నాయకులు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇస్సప్పాలెంలోని స్త్రీశక్తి భవనాలను ఎమ్మెల్యే సందర్శించారు.

నరసరావుపేట: పేదల జీవితాల్లో వెలుగులు నిండిన రోజునే ఎమ్మెల్యేగా విజయవంతమైనట్లు భావిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో గ్రామ గ్రామాన, ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ ప్రారంభించారు. పట్టణంలోని 11, 32, 33, 34 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందించారు. రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి గ్రామం, నరసరావుపేట మండలం ములకలూరు గ్రామం, ఇస్సాపాలెం గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. అధికారులు, సచివాలయం సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్లు

వినుకొండ టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా వినుకొండ మండల తహసీల్దార్‌గా సురేష్ నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. జూనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐగా శావల్యాపురం మండలంలో విధులు నిర్వహించిన ఆయన రెంటచింతల, సత్తెనపల్లి మండలాల్లో తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వంచారు. నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు వినుకొండ తహసీల్దార్‌గా కార్యాలయ సిబ్బంది, పట్టణ డీలర్ల సంఘం నాయకులు, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.


తహసీల్దార్ సురేష్ నాయక్‌ను సన్మానిస్తున్న వినుకొండ పట్టణ డీలర్ల సంఘం నాయకులు

శావల్యాపురంలో....

శావల్యాపురం: కలెక్టరు ఆదేశాల మేరకు మండల నూతన తహసీల్దారుగా వేముల వెంకట నాగరాజు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు స్థానంలో పెరిసోముల నాసరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన వేముల వెంకట నాగరాజు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన పరిధిలో ఉన్నసటువంటి రెవెన్యూ పరమైన సమస్యలు చట్ట ప్రకారం పరిష్కారించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

నాదెండ్ల తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ

నాదెండ్ల: మండల తహసీల్దార్‌గా జెట్టి విజయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆమె అమరావతి మండలంలో పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా ప్రకాశం జిల్లా వెళ్లారు. అక్కడి నుండి బదిలీపై నాదెండ్ల తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. ఎన్నికల విధుల్లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహణలో లోపాల కారణంగా గత తహసీల్దార్ వరకుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటి నుంచి యడ్లపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అక్షిపున్నిసాబేగం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకూ విధులు నిర్వహిస్తున్న అక్షిపున్నిసాబేగం మాతృస్థానం నెల్లూరు జిల్లా వెళ్ళారు. గురువారం ఆమె రిలీవ్ అయ్యారు.

పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర క్షయ వ్యాధి నియంత్రణ అధికారి

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ జె. యస్వంత్ గురువారం సందర్శించారు. ఇప్పటి వరకు గుర్తించిన క్షయవ్యాధి కేసుల రికార్డులను పరిశీలించారు. వారికి ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై సమీక్షించారు. గ్రామంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన బీసీజీ టీకా కేంద్రాన్ని కూడా ఆయన సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న ఏఎన్‌ఎం, ఆరోగ్య సిబ్బందితో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ టి. మురళీ కృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రేవతి భాయి, తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జె. యస్వంత్

పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలి: ఎస్పీ

బొల్లాపల్లి: బండ్లమోటు పోలీసు స్టేషన్‌ను పల్నాడు జిల్లా ఎస్పీ కంచర్ల శ్రీనివాసరావు గురువారం సాయంత్రం సందర్శించారు. రికార్డులు తనిఖీలు చేశారు. శాంతి భద్రతల గురించి స్టేషన్ హౌస్ అధికారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీపడవద్దని, గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ ఏవో పరిటాలకు గౌరవ డాక్టరేట్

నరసరావుపేట: హైదరాబాద్ త్యాగరాయ గాన సభ అమెరికా హోప్ థియలాజికల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ పరిపాలనాధికారి పరిటాల సత్యనారాయణకు గురువారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం పొందారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, హైకోర్టు జడ్జి డాక్టర్ మధుసూదన్, ఏపీ రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చంద్రమోహన్, నేషనల్ చైర్మన్ మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్ట్ డైరెక్టర్ రాజేంద్ర, టాలీవుడ్ యాక్టర్ అండ్ అడ్వైజర్ భవాని రాజేంద్ర, యూనివర్సిటీ చైర్మన్, డిప్యూటీ డైరెక్టర్ జ్యోతి హాజరయ్యారని పరిటాల పేర్కొన్నారు. వారి చేతుల మీదుగా ఈ గౌరవప్రదమైన డాక్టరేట్ తీసుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. కోవిడ్ లాక్ సమయం నుంచి ఎంతోమందికి అందించిన సేవలకు, కష్టకాలంలో వారికి నేను ఉన్నాను అంటూ చేసిన ఎన్నో సామాజిక సేవలు చేసినందుకు ఈ డాక్టరేట్ అందించారన్నారు. ఇది తనకు ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఇలాంటి ఎన్నో సామాజిక సహాయ కార్యక్రమాలు రానున్న రోజుల్లో అందిస్తానని తెలియజేశారు.


డాక్టరేట్ స్వీకరిస్తున్న పరిటాల సత్యనారాయణ

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

నరసరావుపేట: ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి అన్ని ఉపకులాలకి న్యాయం జరిగే విధంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వటం అభినందనీయమని ఆంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, అంబేద్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షులు కాల్వరవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాల వారీగా అమలుపరచవచ్చునని 6:1 నిష్పత్తితో తీర్పును ప్రకటించిందన్నారు. ఈ తీర్పు ఏ కులానికి నష్టం కలుగనీయదని అన్నారు.

● ఎస్సీ వర్గీకరణ పట్ల హర్షం

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవటం పట్ల వర్గాల నాయకులు హర్షం వెలుబుచ్చారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.